క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు భక్తుడి విరాళం



దాతను సత్కరిస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రాజమండ్రికి చెందిన చింతా అనిల్‌కుమార్ దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయ పర్యవేక్షకులు బి.వీరభద్రరావుకు సొమ్మును ఇచ్చారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు.

గ్రామగ్రామానా వీరభద్రుని సంబరాలు

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో వీరభద్రుని సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమనపల్లి, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం గ్రామాల్లో భక్తులు వీరభద్రుని కొలువు చేసుకొని బాజాభజంత్రీలతో గ్రామోత్సవాలు జరిపి బోనాలు సమర్పించారు. అనంతరం అన్నసమారాధనలు ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరభద్రుని దర్శనాలు చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధిత బాలుడికి ఆర్థిక సాయం



సత్యసాగర్‌కు రూ.41 వేలు అందిస్తున్న డాక్టర్ సాయి శిల్ప, ఎఫ్‌టీఎస్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సంక్రాంతి పండగల్లో ప్రమాదవశాత్తూ ఆలయ భవనం నుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన బాలుడు సత్యసాగర్‌కు ఫ్రీ టైమ్ సర్వీస్ (ఎఫ్‌టీఎస్) ఫౌండేషన్ రూ.41,000 సమకూర్చింది. ఎఫ్‌టీఎస్ ఆధ్వర్యంలో పలు సామాజిక మార్గాల ద్వారా సేకరించిన రూ.35 వేలు, ఎఫ్‌టీఎస్ సమకూర్చిన రూ.6 వేలు మొత్తం రూ.41 వేలను బాలుడు చికిత్స పొందుతున్న అమలాపురంలోని సాయి సంజీవిని ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ సాయిశిల్ప చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌టీఎస్ వ్యవస్థాపకుడు తులా రాంబాబు, కాశిన ఫణీంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



విలసవిల్లిలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామానికి చెందిన కోలా దుర్గారావు(40) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అతని భార్య నాగలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు సర్పంచ్ ఊర్మిళాదేవి సోమవారం అందజేశారు. మిగతా సొమ్మును నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి దాసరి కృష్ణాజీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నల్లా శ్రీనివాసరావును కాకినాడ సాహితీ హిందీ అకాడమీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తాను అందించిన వెబ్‌సైట్ కరోనా సమయంలో ఆన్‌లైన్ పాఠాలు బోధించడానికి అకాడమీకి ఎంతగానో ఉపయోగపడిందని, అందుకే తనకు 2022 బెస్ట్ హ్యూమానిటీ అవార్డును అందించారని శ్రీనివాసరావు సోమవారం తెలిపారు.

గోదావరిలో దూకి మహిళ గల్లంతు

ఐ.పోలవరం: మురమళ్ల రాఘవేంద్ర వారధి పైనుంచి ఓ మహిళ గౌతమీ గోదావరిలో దూకి గల్లంతైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కూనపరెడ్డి అమ్మాజీ వారధిపై చెప్పులు విడిచి గోదావరిలో దూకేయడంతో అక్కడున్నవారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిపక్షాల స్వేచ్ఛను హరిస్తున్నారు

సాక్షి అమలాపురం: రాష్ట్రంలో ప్రతిపక్షాల నిరసన హక్కు, భావ స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోందని మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే జీఓ నంబర్-1 తెచ్చారన్నారు. అమలాపురంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. యువగళం పాదయాత్రపై పోలీసు ఆంక్షలు దారుణమన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



ముమ్మిడివరంలో బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: కాకినాడ నెహ్రూ యువ కేంద్రం, ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే స్టడీ సెంటర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం జరిగింది. ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం అధ్యక్షతన జరిగిన జయంతి సభకు సేవా భారతి జిల్లా కన్వీనర్ పవన్ ముఖ్య అతిథిగా పాల్గొని నేతాజీ దేశ భక్తి గురించి ప్రసంగించారు. నేతాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి బండారు శిరీష, ఆర్కే స్టడీ సెంటరు ప్రతినిధి రమేష్‌లు ప్రసంగించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తొలుత జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పార్టీ నాయకులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అయితాబత్తుల సుభాషిణి, పీసీసీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నుగ్గు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అధ్యక్షతన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం సోమవారం జరిగింది. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ నేటి యువతకు ఆదర్శనీయుడని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పార్టీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌ఛార్జి దూరి రాజేష్, పార్టీ నాయకులు దూడల శంకరనారాయణ, ఆకుల వీరబాబు, కొండేటి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా బ్రిటిష్ వారితో పోరాడిన వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఉషాకిరణ్ ఐటీఐలో పీపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, కళాశాల కరస్పాండెంట్ ఎం.త్రిమూర్తులు, ప్రిన్సిపాల్ ఎం.మనోజ్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

బీఎన్ఐ ఎక్స్‌పోతో వ్యాపార బంధాలు బలపడతాయి

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీ



లక్కీ డ్రా విజేతకు బహుమతి అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీ

అమలాపురం టౌన్: బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్ఐ) ఎక్స్‌పో ద్వారా వ్యాపారపరమైన బంధాలు మరింత బలపడతాయని అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అన్నారు. స్థానిక గంగరాజు ఫంక్షన్ హాలులో జరుగుతున్న బీఎన్ఐ ఎక్స్‌పోను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బీఎన్ఐ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకర్ అధ్యక్షతన వ్యాపార సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశానికి తాతాజీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎక్స్‌పోలో ఓ వ్యాపార సంస్థ నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీ బహుమతులు అందజేశారు.

రథయాత్రను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన వారాహి రథయాత్రను విజయవంతం చేయాలని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పవన్ కల్యాణ్ రథయాత్రలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రెడ్డిపల్లి ఆధార్ కేంద్రం తనిఖీ

అమలాపురం రూరల్: రెడ్డిపల్లి గ్రామ సచివాలయంలోని ఆధార్ కేంద్రాన్ని అమలాపురం డీఎల్పీవో గుబ్బల మల్లిఖార్జునరావు, ఎంపీడీవో ప్రసాద్‌లు సోమవారం తనిఖీ చేశారు. ఆధార్ నవీకరణ ప్రక్రియ జరిగే తీరును డీఎల్పీవో మల్లిఖార్జునరావు పరిశీలించారు. ఆధార్ కేంద్ర సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత బోడసకుర్రు కింగ్స్ జట్టు



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ అరుణ

అమలాపురం రూరల్: పేరూరు డీఎన్ శెట్టి, డీపీ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పేరూరు ప్రీమియం లీగ్ సీజన్-3 పేరుతో ఆదివారం క్రికెట్ పోటీలు హోరా హోరీగా జరిగాయి. అమలాపురం రూరల్ మండల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ఫైనల్స్‌లో బోడసకుర్రు కింగ్స్ జట్టు, పేరూరు మాస్టర్స్ జట్టు తలపడ్డాయి. కింగ్స్ జట్టు విన్నర్‌గా... మాస్టర్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విజేత జట్లకు గ్రామ సర్పంచ్ దాసరి అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మట్టపర్తి పురుషోత్తమరాజు బహుమతులు అందజేశారు. పేరూరు గ్రామ పెద్దలు దాసరి అరుణ డేవిడ్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పెచ్చెట్టి చంద్రమౌళి, న్యాయవాది కుడుపూడి అశోక్, ఇళ్ల రాము పోటీల ఏర్పాట్లలో సహాయ సహకారాలు అందించారు.

28న వాహనాల వేలం

తాళ్లరేవు: నాటుసారా, సుంకం చెల్లించని మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ శనివారం కాకినాడలోని ఏఆర్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం 8 గంటలకు వేలం ప్రారంభించనున్నట్టు తెలిపారు. 52 మోటార్ సైకిల్స్, మూడు ఆటోలకు వేలం పాట జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ధరావత్తు జమచేసి వేలంలో పాల్గొనొచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 99636 91117 నెంబరులో సంప్రదించాల్సిందిగా సీఐ కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలో రూ.91 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి సోమవారం శంకుస్థాపనలు చేశారు. గాడిమొగలో ధనమ్మ ఆలయం వద్ద గ్రావెల్ లెవలింగ్, హైస్కూల్ రోడ్డు నుంచి పీడబ్ల్యూడీ స్కీం వరకూ మెటల్ రోడ్డు, సత్తెమ్మ తల్లి గుడి వీధిలో డ్రైనేజీ, రహదారి నిర్మాణం, శ్మశానం గ్రావెల్ లెవలింగ్, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి శ్మశానం వరకూ సిమెంట్ రహదారి తదితర పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, ఉపసర్పంచ్ కె.లోకేష్, ఎంపీటీసీ సభ్యురాలు వనమాడి వేణి, వార్డు సభ్యులు పినపోతు రాము, నల్లి అనంతలక్ష్మి, కామాడి మాతరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తాళ్లరేవు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడిపూడి శివన్నారాయణ అన్నారు. జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల తిరుపతిలో జరిగిన జాతీయ స్థాయి లేజర్ రన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఐదు పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ అరుణ, కరస్పాండెంట్ మేరీగ్రేస్, నాయకులు రెడ్డి నాగేశ్వరరావు, పెట్ల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ మండపానికి గ్రానైట్

రూ.9 లక్షల వ్యయంతో నిర్మాణం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం ముఖ మండపం నేలను గ్రానైట్ రాళ్లతో ఆధునికీకరిస్తున్నారు. పేరు వెల్లడించడానికి అంగీకరించని ఓ దాత రూ.9 లక్షల వ్యయంతో గ్రానైట్ రాళ్లను అందించారు. ఆలయానికి ఇప్పటికే దాతల సహకారంతో దాదాపు రూ.50 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో గ్రానైట్ రాళ్ల నిర్మాణంతో ఆలయం మరింత కొత్త సొబగులను అద్దుకుంటోంది. మరో మూడు రోజుల్లో మండపానికి గ్రానైట్ పనులు పూర్తవుతాయని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తెలిపారు. భక్తుల విరాళాలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తమ ధర్మకర్తల మండలి ప్రణాళిక సిద్ధం చేసిందని ఆమె పేర్కొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్స్

యానాం: జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని నిర్వహించే పోలీస్ తదితర విభాగాల కవాతు రిహార్సల్స్‌ను సోమవారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రదర్శించారు. సాధారణ పోలీసు విభాగం, ఇండియన్ రిజర్వు బెటాలియన్, హోంగార్డులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలు, వివిధ పాఠశాలల బాలబాలికలు రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. సీఐ గూటం శివగణేష్, వివిధ విభాగాల ఎస్ఐలు బడుగు కనకారావు, కట్టా సుబ్బరాజు, పువ్వల వీరభద్రస్వామి తదితరులు పాల్గొని పరేడ్ ప్రదర్శనను పర్యవేక్షించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న 225 మంది విద్యార్థులకు గాను 88 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం లంకా రాణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ దోనిపాటి రమావెంకటరమణ, పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గరిమెళ్ల స్వామిప్రసాద్, ఎస్.సీతాదేవి, కె.గణేశ్వరరావు, కెవీ సత్యనారాయణ, అడబాల శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సుధాకర్

యానాం: ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ చింతపల్లి కృష్ణ సుధాకర్‌కు యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం కార్మికశాఖ కార్యదర్శి పి.రజని ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఎస్‌కే సెంథిల్‌వేలన్‌ను పుదుచ్చేరి జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అండ్ బాయిలర్స్‌కు బదిలీ చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అల్లవరం: పేరూరు వై జంక్షన్ నుంచి ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌కు టాటా కంపెనీకి చెందిన రెండు భారీ ట్యాంకర్లను తరలించు నిమిత్తం మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ ఈఈ రవికుమార్ సోమవారం తెలిపారు. అల్లవరం, దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 2 గంటల వరకు, బెండమూర్లంక సబ్‌స్టేషన్ పరిధిలో రాత్రి 10 గంటల నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు చెప్పారు.

వైభవంగా ప్రారంభమైన కల్యాణ మహోత్సవాలు

యానాం: యానాంలో కొలువైన రాజరాజేశ్వరీ సహిత రాజరాజేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వర దేవస్థాన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పుష్పకవాహనంపై స్వామివారిని అధిష్ఠించి పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్ పాల్గొన్నారు. ఆలయంలో సూర్యప్రకాష్, శిరీష దంపతులచే ఘనంగా ఛండీయాగం నిర్వహించారు.

జెడ్పీటీసీ పరామర్శ

ఉప్పలగుప్తం: మాతృవియోగంతో బాధపడుతున్న వానపల్లిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లా నాయుడు కుటుంబీకులను జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు సోమవారం పరామర్శించారు. నాయుడు తల్లి మాణిక్యం వృద్ధాప్యంతో మరణించింది. ఆమె చిత్రపటానికి జెడ్పీటీసీ నివాళులర్పించి, వారి కుటుంబీకులకు సానుభూతిని తెలిపారు. సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యల రమణ పరామర్శించిన వారిలో ఉన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం

అల్లవరం: గంజాయి, హెరైన్, కొకైన్ వంటి మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడంలో యువత, విద్యార్థులు ముందుకు రావాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శివరామరాజు అన్నారు. గోడిలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్ సాయిబాబు అధ్యక్షతన మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నా టోల్ ఫ్రీ నెంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని శివరామరాజు సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి



నార్గన రమేష్ (ఫైల్)

అల్లవరం: ఎంట్రుకోన గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ మండల కార్యదర్శి నార్గన రమేష్ సోమవారం ఉదయం ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఫిబ్రవరి 9న జరగనున్న ఆయన పెద్ద కుమార్తె వివాహానికి సోమవారం ఉదయం వినాయక పూజ నిర్వహించారు. అనంతరం గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా వ్యవహరిస్తూ గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేశారు. రమేష్ మృతిపై రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షులు బాపూజీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎస్సీ రైతులకు ఓఎన్జీసీ పరిహారం మంజూరు

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



ఓఎన్జీసీ పరిహారం వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: ఓఎన్జీసీ రెండో గ్యాస్ పైపులైను నిర్మాణం వల్ల నష్టపోతున్న దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల రైతులకు ఎకరానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం మంజూరైనట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. సోమవారం ఆయన క్యాంప్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. సముద్రం నుంచి వేస్తున్న గ్యాస్ పైపులైను గౌతమీ గోదావరికి ఆనుకుని ఉన్న సుమారు వంద ఎకరాల్లోని ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల మీదుగా వెళుతుందన్నారు. ఈ నేపథ్యంలో భూముల్ని నష్టపోతున్న రైతుల్లో మొదటి విడతగా 50 మందికి రూ.1 కోటి వారి ఖాతాల్లో జమయ్యిందని చెప్పారు. మిగిలిన రైతులకు త్వరలోనే పరిహారం మంజూరవుతుందన్నారు. ఈ సందర్భంగా తమ భూములకు ఓఎన్జీసీ నష్టపరిహారం తేవడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు దరియాలతిప్ప రైతులు ధన్యవాదాలు తెలిపారు.

ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న 2010-11 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

యానాం: ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని వాటిని జీవితాంతం పదిలంగా దాచుకుంటామని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. సోమవారం దరియాలతిప్ప డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో చదివిన 2010-11 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పన్నెండేళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులంతా జీవనగమనంలో దేశంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. సోమవారం ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు వచ్చి బాల్యంలో గడిపిన తీపి గుర్తుల్ని నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు చదువులు చెప్పిన గురువులు మొండి సత్యనారాయణ, కోట్ల వెంకన్నబాబు, నాగమనీంద్రరావు, వినకోటి మహేశ్వరరావు, కడియం సుబ్బారావు, మధు, బాబి, రమణ, విజయలక్ష్మి తదితర ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామకృష్ణ, శేఖర్, సందీప్, అన్నపూర్ణ, సన్యాసిరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న జెడ్పీటీసీ గౌతమి, ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కొనుకు గౌతమి అన్నారు. అల్లవరం, గోడిలంక, కొమరగిరిపట్నం, తూర్పులంక, ఓడలరేవు హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ గౌతమి, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు మల్లాడి మంగాయమ్మ, రాకాపు విజయలక్ష్మి, బొమ్మి బాలవేణి, కడలి గంగాచలం, ఇన్‌చార్జ్ సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ ఎస్.మౌనిక, ఎంపీడీఓ సరోవరరావు, ఎంఈఓ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ క్రికెట్ టోర్నీ విజేత అగ్ని లయన్స్



జైభీమ్ ట్రోఫీని కైవసం చేసుకున్న అగ్ని లయన్స్ జట్టు

యానాం: సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణ పరిధిలోని మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో గత కొద్దిరోజులుగా జరుగుతున్న జైభీమ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ సోమవారం జరిగాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో అగ్ని లయన్స్ జట్టు గిరియాంపేట జట్టుపై 12 పరుగుల తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విజేతలకు, రన్నర్స్‌కు మాజీ మున్సిపల్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మెట్టకూరు హైస్కూల్ గ్రౌండ్‌ను పూర్తిస్థాయిలో క్రికెట్ టోర్నీలు నిర్వహించుకునే విధంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లెల్ల శ్రీకాంత్, ఉండ్రు వైష్ణవ్, ఎలిపే సాయి, మల్లవరపు దయ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే అశోక్ పూజలు



వీరభద్రస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే అశోక్

యానాం: కనకాలపేట గ్రామంలో కొలువైన వీరభద్రస్వామి సంబర మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వీరభద్రుని ఆలయం వద్ద ఆలయ అర్చకులు కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కనకాల వీరబాబు, మాగాపు సుబ్బారావు, కవల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రంగనాయకపురంలో విషాద ఛాయలు

తాళ్లరేవు: స్థానిక రంగనాయకపురం గ్రామానికి చెందిన గాదిరాజు భారతి(41) అనే వివాహిత బాలయోగి వారధిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, ఐ.పోలవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు భారతి ఈ నెల 22వ తేదీన తన తల్లిని పోలవరంలో దింపేందుకు వెళ్లి తిరిగి వస్తూ ఈ అఘాయిత్యానికి ఒడిగట్టింది. కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు చెబుతున్నారు. భారతి మృతదేహం గౌతమి గోదావరిలో సోమవారం లభ్యమైంది. ఇలా ఉండగా మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే భారతి ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్రంగా కలిచి వేసింది.

రెండో రోజు నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: మండల పరిధి విలసవిల్లిలో జరుగుతున్న మహా సౌరయాగంలో భాగంగా రెండోరోజు ధనిష్ఠ నక్షత్ర జాతకులకు జమ్మి వృక్షంతో పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. పండితులు దత్తాత్రేయ శర్మ, దివాకర్ శర్మ శ్రీచక్ర అర్చన, సౌర హోమం, చండీ హోమం నిర్వహించారు.